క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

మాచర్ల: కృష్ణవేణి ఎస్వీఆర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.వెంకట్రామయ్య పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. శ్రీదరియం ఆయుర్వేదిక్ ఐ క్లీనిక్ పంచకర్మ సెంటర్ వైద్యులు 150 మందికి కంటి పరీక్షలు చేశారు. ఆసుపత్రి ఇన్‌చార్జి పవన్‌కుమార్, డాక్టర్ కృష్ణరాజు, వైద్యులు కంటి పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

రోడ్లపై గుంతలు పూడ్చివేత



మాచర్ల: శ్రీ రామకృష్ణ సేవా సమితి మాచర్ల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో పలు ప్రాంతాల్లో ఏర్పడిన గుంతలను పూడ్చారు. పట్టణంలోని రైల్వేగేటు, చంద్రవంక బ్రిడ్జి ప్రాంతాల్లో రోడ్డుపై ఏర్పడిన గుంతలను సరిచేశారు.గత 20 సంవత్సరాలుగా సేవా సమితి ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజలకు అందిస్తూ, రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చడం, తదితర సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం ముత్యాల పాపి రెడ్డి, ఆర్టీసీ ఉద్యోగి పి.శ్రీనివాసరావు, సేవాసమితి సభ్యులు వినయ్ హరి, రాజు, అంజిబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఎమర్జెన్సీ

రెంటచింతల: తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీని విధించినట్లు బీజేపీ సీనియర్ నాయకులు పాశం మట్టారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ఆమె మనవడు రాహుల్‌గాంధి ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని మారుస్తాడని ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి గుమ్మడి నాసరయ్య, మాజీ మండల అధ్యక్షులు ఎస్.పుల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వరప్రసాదరావు, విజయకుమార్ ఉన్నారు.

దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



సత్తెనపల్లి: పురోహితుడు పాతూరి సాయికృష్ణ శర్మను అసభ్య పదజాలంతో దూషించి దాడికి యత్నించిన ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలుపై చర్యలు తీసుకోవాలని వేద గాయత్రి పురోహితుల బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావును శనివారం వారు కలిసి జరిగిన ఘటనను వివరించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్పీ హనుమంతరావు సూచనల మేరకు సత్తెనపల్లి టౌన్ సీఐ నాగమల్లేశ్వరరావును నాయకులు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ముప్పాళ్ళ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 29వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం జరుగుతుందని పూర్వ విద్యార్థులు శనివారం తెలిపారు. ఉదయం 8 – మధ్యాహ్నం ఒంటి గంట వరకు నరసరావుపేటకు వైద్యులు ఉచిత కంటి, షుగర్, బీపీ, కీళ్ళ నొప్పుల పరీక్షలు చేస్తారన్నారు. తాడువాయి జగన్నాథం, ధనలక్ష్మి జ్ఞాపకార్థం శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు గురుపూజోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో శ్రీ గురు పూజోత్సవం జరగనుంది. ఈ మేరకు ఖండ సంఘ చాలక్ చలువాది చిన్న సత్యనారాయణ శనివారం తెలిపారు. ముఖ్య అతిథిగా బాలాజీ ఫీ స్వీట్స్ అధినేత తెంటు బాలాజీ, ప్రధాన వక్తగా గుంటూరు విభాగ్ శారీరిక్ ప్రముఖ్ దామెర్ల నరసింహారావు హాజరు అవుతారన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వినతి

క్రోసూరు: స్థానిక నాలుగు రోడ్ల సెంటర్లో మురుగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు పేర్కొన్నారు. శనివారం సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి, నిరసన తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారికి సమస్యను ఫోన్లో వివరించారు. రవిబాబు మాట్లాడుతూ.. నెలల తరబడి మురుగు నీరు పారుతూ ఆర్ అండ్ బీ రోడ్డు కోత పడటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యాలయానికి సమీపంలోనే ఈ ప్రాంతం ఉన్నా సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మండల అధికారులు వచ్చి పరిష్కరిస్తారని జిల్లా పంచాయతీ అధికారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు

- చట్టం ముందు నిలబెడతాం
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



హరికృష్ణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

దాచేపల్లి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టిన పోలీసులను చట్టం ముందు నిలబెట్టి తీరుతామని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని తంగెడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఉప్పుతల యల్లయ్య కుమారుడు హరికృష్ణపై ఇటీవల పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి చిత్రహింసలు గురిచేసి జైలుకు పంపించిన విషయం తెలిసిందే. పోలీసుల చిత్రహింసల నేపథ్యంలో హరికృష్ణ కాలికి తీవ్ర గాయాలు కావడంతో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నాడు. గ్రామంలోని తన నివాసంలో ఉన్న హరికృష్ణను మాజీ ఎమ్మెల్యే కాసు శనివారం పరామర్శించారు. పోలీసులు తనను కొట్టిన తీరును హరికృష్ణ వివరించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు విచారించిన అంశాలపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ.. హరికృష్ణపై దాచేపల్లి సీఐ భాస్కర్ అక్రమంగా కేసు నమోదు చేసి చిత్రహింసలు గురిచేశారని చెప్పారు. వైఎస్సార్ సీపీ బలంగా పనిచేస్తున్న హరికృష్ణ, ఆయన తండ్రి యల్లయ్యను అన్ని విధాలుగా ఇబ్బందులు పెట్టేందుకే సీఐ అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నాడని తెలిపారు. హరికృష్ణ కుటుంబ సభ్యులకు తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తామంత అండగా ఉంటామని, న్యాయపోరాటం చేసి హరికృష్ణకు న్యాయం జరిగేలా తమ వంతు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గురజాల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టి అక్రమ కేసులు పెట్టి వేధించే పోలీసులపై న్యాయపరంగా పోరాటం చేస్తున్నామని, న్యాయస్థానం ద్వారా వచ్చే తీర్పుతో పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెప్పారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్, మండల, పట్టణ కన్వీనర్లు కోటకృష్ణ, షేక్ సుభాని, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ సభ్యుడు మూలగుండ్ల ప్రకాష్ రెడ్డి, మాజీ సర్పంచులు బుర్రా విజయకుమార్ రెడ్డి, మందపాటి రమేష్ రెడ్డి, నాయకులు షేక్ జాకీర్ హుస్సేన్, దేవళ్ల వీరస్వామి, ఆరికట్ల మల్లారెడ్డి, బీరవెల్లి శౌరిరెడ్డి, గోగిరెడ్డి వెంకటరెడ్డి, వట్టె రామచంద్ర రెడ్డి, కాసర్ల నరసింహారెడ్డి, దైద నాగరాజు, కొత్తపల్లి ప్రవీణ్, కొత్తపల్లి అశోక్, షేక్ జానీ బాషా, సైదా ఉన్నారు.

పీర్లు అలంకరణ



ఇరికేపల్లిలోని పీర్లచావిడిలో అలంకరించిన పీర్లు

దాచేపల్లి: మండల వ్యాప్తంగా చావిడిలలో పీర్లను శనివారం తెల్లవారుజామున కిందకు దించారు. మొహరం పండుగ నేపథ్యంలో ఆకాశంలో నెలవంక కనిపించడంతో చావిడిలలో పీర్లను అలంకరణ చేశారు. దాచేపల్లి నగర్ పంచాయతీ పరిధిలో పలు చావీడులలో పీర్లతోపాటు గంధం పీర్లను అలంకరణ చేశారు. కేసనపల్లి, తంగెడ, గామాలపాడు, పొందుగల, పెదగార్లపాడు, ముత్యాలంపాడు, రామాపురం గ్రామాల్లోని చావడిలలో పీర్లను అలంకరణ చేశారు. భక్తులు పీర్లను దర్శించుకుని ప్రత్యేకంగా మొక్కలు తీర్చుకున్నారు. పెద్ద శరగత్తు, చిన్న శరగత్తు సందర్భంగా తంగెడ, దాచేపల్లిలో తిరునాళ్ల జరుపుకోవటం ఏళ్ల తరబడి ఆనవాయితీగా వస్తుంది.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

మాచర్ల డీఈఈ నూతలపాటి సింగయ్య

పిడుగురాళ్ల: రైతులకు నాణ్యతమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు మాచర్ల డీఈఈ నూతలపాటి సింగయ్య అన్నారు. కోనంకి, పాత గణేశుడు 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలలో కొత్త గా ఏర్పాటు చేసిన వ్యవసాయ ఫీడర్ బ్రేకర్‌లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగయ్య మాట్లాడుతూ ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా రూ.45 లక్షలతో వ్యవసాయ ఫీడర్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అధిక లోడుతో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పుడు ఆ ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. అధిక లోడు వలన వస్తున్న లైన్ నష్టాలు తగ్గించడం జరిగిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇక నుంచి ఈ సబ్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సమయానికి రైతులకు అందుబాటులో ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల రూరల్ ఏఈ లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే



విద్యార్థులతో సుబ్బారావు

పెదకూరపాడు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపైనా శ్రద్ధ పెట్టాలని ఆడిట్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర డెప్యూటీ డైరెక్టర్, పూర్వ విద్యార్థి కొర్లకుంట సుబ్బారావు అన్నారు. పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి షేక్ అక్బర్ సహకారంతో 40 మంది హాకీ, వాలీబాల్ క్రీడాకారులకు రూ.25 వేల విలువ చేసే క్రీడా దుస్తులను శనివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, పూర్వ విద్యార్థి షేక్ బాలిసైద్ మాట్లాడుతూ 1981–86 పూర్వ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కాకాని వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాలకు సహకారం అందిస్తున్న వారిని అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోదేపల్లి రమాదేవి, వి. శ్రీనివాసరెడ్డి, చిల్లపల్లి సత్యం, మంచినీళ్ల శ్రీధర్, వి.కుంచనపల్లి హనుమంతరావు, కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ



అచ్చంపేట: గుర్తుతెలియని వ్యక్తులు 25కేవీ వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్, ఆయిల్ చోరీ చేశారు. ఈ ఘటన మండలంలోని కోగంటివారిపాలెం పొలాలలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద తేళ్లూరి కోటిరెడ్డి, పిండి కొండలు, గుడిశా చిన నర్సిరెడ్డి, మర్యాద కృష్ణారెడ్డి, బోనం నాగిరెడ్డిలకు చెందిన సుమారు 20 ఎకరాలకుపైగా వ్యవసాయ భూములున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు రైతులు పనులు చేసుకుని ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం వెళ్లేసరికి చోరీ విషయం వెలుగుచూసింది. పోలీసులకు ఫిర్యాదు చేసి తగిన చర్యలు చేపడతామని విద్యుత్తు అధికారులు హామీ ఇచ్చినట్లు రైతులు చెప్పారు.

లోడు ట్రాక్టర్లతో పొంచి ఉన్న ప్రమాదం



రాజుపాలెం: మండలంలోని కొండమోడు క్వారీల నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లు పిడుగురాళ్ల సమీపంలోని ముగ్గు మిల్లులకు రాళ్లను నిత్యం తోలుతున్నాయి. అధిక లోడుతో హైవేపై అతివేగంగా వెళుతుండటంతో వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు, పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

నకరికల్లు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జి.కాశయ్య సూచించారు. నకరికల్లులో చేపట్టిన శుభ్రతా పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు. వర్షాల కారణంగా సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని పేర్కొన్నారు. దుకాణాలు, గృహ సముదాయాల వద్ద వ్యర్థాలను నిర్దిష్ట ప్రదేశంలో పడేసేలా చూసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో వ్యర్థాల తొలగింపు, మురుగునీటి పారుదల క్రమబద్ధీకరించడం వంటి పనులను నిత్యం పరిశీలించాలని అధికారులకు సూచించారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో పి.రత్నం శనివారం పరిశీలించారు. కూలీలకు కల్పించిన వసతుల గురించి తెలుసుకున్నారు. వారి సమస్యలపై ఆరా తీశారు. మండలంలోని 11 గ్రామాల్లో 1,075 మంది కూలీలు పనులకు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. వెంట ఏపీఓ ఏడుకొండలు, టెక్నికల్ అసిస్టెంట్ హనుమంతురావు, సిబ్బంది ఉన్నారు.

కొనసాగిన దొడ్లేరు సీజీజీబీ

గోల్డ్ బాధితుల ఆందోళన


బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో గల దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు (సీజీజీబీ)లో 22 మాసాల క్రితం బంగారం గోల్‌మాల్ అయిన నేపథ్యంలో బాధితులు నేటికీ న్యాయం కోసం పోరాడుతున్నారు. బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వారు చేపట్టిన ఆందోళన శనివారం రెండవ రోజుకు చేరింది. బ్యాంకు ఎదుటే వారి ఆందోళన కొనసాగింది. ఏపీ రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళన సందర్భంగా జిల్లా కౌలు రైతు సంఘం ప్రతినిధి తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడారు. బాధితులు మొత్తం 520 మంది ఉండగా, వారిలో ఇంకా 130 మందికి సమస్య పరిష్కారం చేయాల్సి ఉందని తెలిపారు. అయినప్పటికీ బ్యాంకు అధికారులు ఎటువంటి సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బాధితుల సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా బంగారం పోయిన బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై దొడ్లేరు సీజీజీబీ మేనేజరు బి.శివశంకర్ స్పందిస్తూ.. 'ఈ సమస్యల పరిష్కారం బాధ్యతను రీజినల్ బ్యాంకు అధికారులు చూస్తున్నారు. త్వరలోనే అన్ని ఇబ్బందులను పరిష్కరిస్తారు. ప్రస్తుతం నేను ఈ విషయంలో ఏమీ చెప్పలేన'ని పేర్కొన్నారు.


బ్యాంకు లెక్కల్లో నమోదు కాలేదు



నేను 24 గ్రాముల కాసుల దండ తాకట్టు పెట్టాను. అప్రైజర్ నాగార్జున రశీదు ఇచ్చాడు. బ్యాంకు లెక్కల్లో మాత్రం నమోదు చేయలేదు. రూ.60 వేలు రుణం తీసుకున్నాను. ఇప్పుడు బ్యాంకు అధికారులు తమ పుస్తకాల్లో ఈ వివరాలు లేవని, తమకు సంబంధం లేదని చెబుతున్నారు. ఇదెక్కడి అన్యాయమో అర్థం కావడం లేదు.

– తరిమెళ్ల శేషంరాజు, కొండూరు గ్రామం, అచ్చంపేట మండలం

నాలుగు వస్తువులు మిస్ అయ్యాయి



నేను బ్యాంకులో 2019లో ఆరు బంగారు వస్తువులు మొత్తం 57 గ్రాములు బరువు కలిగినవి తాకట్టు పెట్టాను. ఇప్పుడు నా పేరిట రెండు వస్తువులు మాత్రమే ఉన్నాయంటున్నారు. నాలుగు వస్తువులు మిస్ అయ్యాయి. నా దగ్గర అన్ని రకాల ఆధారాలు ఉన్నాయి. బ్యాంకు అధికారులు మాత్రం తమ సంబంధం లేదని అంటున్నారు. వడ్డీ కూడా కట్టించుకున్నారు. న్యాయం చేయాలి.

– యర్రంశెట్టి వీరయ్య, దొడ్లేరు గ్రామం, క్రోసూరు మండలం

మత్తు పదార్థాలతో నష్టాలపై అవగాహన



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

బెల్లంకొండ: మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డా.కిరణ్ కుమార్, డా.దీపికలు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మణికుమారి, సూపర్‌వైజర్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

గురజాల: జూలై 5న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్ బాబు ఆదేశాల మేరకు స్థానిక కోర్టులో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను కక్షిదారులు రాజీ చేసుకోవాలని కోరారు. పోలీసులు చొరవ తీసుకుని లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను గుర్తించి తీసుకురావాలని సూచించారు. గురజాల కోర్టు పరిధిలో ఉన్న రాజీ పడదగిన సివిల్ క్రిమినల్ చెక్ బౌన్స్, మోటార్ వాహన ప్రమాద కేసులు, భూ తగాదాలు కుటుంబ వివాదాలు తదితర కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కేవీవీ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: జూలై 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షి దారులందరూ సద్వినియోగించుకోవాలని పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి టి.ప్రవల్లిక శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు ఆదేశాల మేరకు జూలై 5 మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

లక్ష్యంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

న్యాయమూర్తి ప్రవల్లిక



మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రవల్లిక

పిడుగురాళ్ల: విద్యార్థి దశలోనే లక్ష్యాలతో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని పిడుగురాళ్ల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, న్యాయమూర్తి టి.ప్రవల్లిక అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశంపై అవగాహన కల్పించారు. పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని, సరైన ప్రణాళికతో లక్ష్యసాధనలో విద్యార్థులు విజయ పథంలో దూసుకుపోతారని అన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, సమయాన్ని వృథా చేయకుండా భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ కోపూరి వెంకటేశ్వర్లు, న్యాయవాదులు మందా జాకబ్, ప్యానల్ న్యాయవాది జీ రమేష్, పారా లీగల్ వలంటీర్ నవ్య, వి.రామకృష్ణ పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



ఎంపీడీఓ కె.సరోజినిదేవి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తే ప్రజల మన్ననలు పొందుతారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సరోజినిదేవి ఉద్యోగ విరమణ సన్మానసభ శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ విధి నిర్వహణలో సరోజినీదేవి చేసిన సేవలు ప్రసంశనీయమన్నారు. ఉద్యోగం బాధ్యత అనుకోవాలేకాని ఎవరూ కూడా పని భారంగా భావించవద్దన్నారు. వెనుకబడిన పల్నాడు ప్రాంత అభివృద్ధి, ఉద్యోగుల సహకారంతోనే సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం ఆయన ఎంపీడీఓ సరోజినీదేవి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ గబ్రూ నాయక్, ఈఓపీఆర్డీ సిహెచ్.శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ గాదె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో అనర్థాలపై అవగాహన



పెదకూరపాడు: విజేతలకు బహుమతులు అందిస్తున్న వైద్యసిబ్బంది




క్రోసూరు: విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

పెదకూరపాడు: పొగాకు వాడకం కాన్సర్‌కు కారణమని 75 త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పొగాకు నివారణపై విద్యార్థులకు పాఠశాలలో వైద్యశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ దిలీప్‌కుమార్‌లు మాట్లాడుతూ పొగాకు వాడకంతో యువత ఆరోగ్యంతోపాటు ఆయుష్షు కూడా కోల్పోతున్నారని పేర్కొన్నారు. పొగాకు వాడకం వల్లన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు.

క్రోసూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో....

క్రోసూరు: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం క్రోసూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ ఆధ్వర్యంలో పొగాకు వాడకంతో అనర్థాలపై అవగాహన కల్పించారు. ఇదే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు జి.రాము, ఎస్‌ఎఫ్‌సీ మనోజ్ఞ, సీహెచ్ షాలోమ్‌లకు పీహెచ్‌సీ వైద్యధికారి డాక్టర్ సిరిచందన, ప్రధానోపాధ్యాయులు జి రామాంజనేయులు, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ స్కూల్ బ్యాగులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుగ్గి బాబురావు, ఆరోగ్య కార్యకర్త లావణ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల రహితంగా గ్రామాలు



సత్తెనపల్లి: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఘన వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దాలని సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నందిగామలో ఉన్న సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్ (మోడల్ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్)లో నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల డిప్యూటీ ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శనివారం శిక్షణ ఇచ్చారు. దీనిని ప్రారంభించాక ఆయన మాట్లాడారు. లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఎలా కృషి చేయాలో సూచించారు. స్వచ్ఛత కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రత బాట పట్టాలని పిలుపునిచ్చారు. సత్తెనపల్లి డిప్యూటీ ఎంపీడీఓ ఎ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛత లక్ష్యాలను చేరుకోవడంలో ప్రజల పాత్ర కూడా కీలకమన్నారు. ముప్పాళ్ళ డిప్యూటీ ఎంపీడీఓ రూపవతి మాట్లాడుతూ బిన్ – బ్యాగ్ విధానంలో ఇంటింటి నుండి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. నకరికల్లు ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వర్మి కంపోస్టు తయారీ గురించి వివరించారు. ఐటీసీ రీసోర్స్‌పర్సన్ సీహెచ్ బొల్లయ్య మాట్లాడుతూ నందిగామను పారిశుద్ధ్య కార్యక్రమాల్లో మోడల్ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దిన తీరు వెల్లడించారు.

